# భారత్.. వివిధ రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

**భారత్ అభివృద్ధి దిశగా పయనించడానికి అమలు చేసిన అనేక వ్యూహాల్లో ఆర్థిక సంస్కరణలు కీలకమైనవి. 1991 లో ప్రవేశపెట్టిన ఈ సంస్కరణల ఫలితంగా దేశంలో విదేశీ పెట్టుబడుల ప్రవాహం వేగం పుంజుకుంది. ప్రారంభంలో కొంత శాతం వరకే విదేశీ పెట్టుబడులను అనుమతించేవారు. తర్వాత కొన్ని రంగాల్లో వాటాను పెంచితే.. కొన్ని రంగాల్లో 100 శాతం మేరకు ఎఫ్‌డీఐలను ఆమోదిస్తున్నారు. ఈ క్రమంలో.. ప్రైవేట్ బ్యాకింగ్ రంగంలో 2004 నుంచి 74 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తున్నారు. టెలికాం రంగంలో పెట్టుబడుల పరిమితిని 2005లో 49 నుంచి 74శాతానికి పెంచారు. ఫార్మాస్యుటికల్ రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తున్నారు. పెరుగుతున్న ప్రత్యక్ష పెట్టుబడులు.. శ్రామిక మార్కెట్‌లో సరళీకరణ విధానాలకు తోడ్పాటునందిస్తూ, వేతనాలలో అసమానతలను తగ్గించడానికి కూడా దోహదం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో విదేశీపెట్టుబడుల తీరుతెన్నులపై విశ్లేషణ..**

కేంద్రప్రభుత్వం 1990లో ప్రవేశపెట్టిన సరళీకృత ఆర్థిక విధానాల కారణంగా దేశంలో విదేశీ పెట్టుబడులు వేగవంతమయ్యాయి. దీంతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశీ సంస్థాగత పెట్టుబడులు పెరిగాయి. అంతేకాకుండా ఆయా రంగాల్లో పెట్టుబడులకు కావాల్సిన ప్రోత్సాహక వాతావరణం కల్పించడం కూడా ఇందుకు దోహదం చేసింది. రిటైల్, రియల్ ఎస్టేట్, టెలికమ్యూనికేషన్స్, ప్రైవేట్ బ్యాంక్‌లు, హోటల్-టూరిజం, ఆటోమొబైల్, విమానాశ్రయాలు, ఫార్మాస్యుటికల్ రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరగడం కూడా దేశ ఆర్థికాభివృద్ధి సాధనకు దోహదప డ్డాయి. దేశం ఆర్థిక స్థిరత్వం సాధించడానికి కూడా అవకాశం చిక్కింది. పరిశ్రమల కేటగిరీలు, వివిధ రంగాలపై ఉన్న పెట్టుబడుల పరిమితిని దృష్టిలో ఉంచుకుని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని రకాల ప్రతిపాదనల్లోని విదేశీ ఈక్విటీని రెండు వారాల్లోగా అనుమతినిస్తోంది. రిజర్వు బ్యాంక్ ఆటోమేటిక్ అప్రూవల్‌కు అవకాశం లేని అంశాలను 'విదేశీ పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు' నాలుగు నుంచి ఆరు వారాలలోపు ఆమోదిస్తుంది.



## ప్రైవేట్ బ్యాకింగ్ రంగం:

ప్రైవేట్ బ్యాకింగ్ రంగంలో 2004 నుంచి 74 శాతం మేర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతినిస్తున్నారు. దేశంలో ఇప్పటికే శాఖలు ఉన్న విదేశీ బ్యాంకుల విషయంలో.. ఆటోమేటిక్ రూట్ ద్వారా 49 శాతం విదేశీ ఈక్విటీని ఆమోదిస్తున్నారు. ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తున్న విదేశీ పెట్టుబడిదారులకు ఆటోమేటిక్ రూట్ ద్వారా కొత్తగా వాటాలు జారీ చేయరు. వారు అదనపు పెట్టుబడి కోసం 'విదేశీ పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు' అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దేశంలో 29 ప్రైవేట్ బ్యాంకులు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. పెట్టుబడుల ఉపసంహరణ కోసం ఈ బ్యాంకులకు అవకాశం కల్పించారు. సిటీ బ్యాంక్, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్‌ల స్థితి రిటైల్ మార్కెట్‌లో అంత ఆశాజనకంగా లేదు. ప్రస్తుతం సరళీకరణ నేపథ్యంలో రిటైల్ మార్కెట్‌లో విదేశీ బ్యాంకుల ప్రవేశానికి ఎటువంటి ఆంక్షలు లేవు. దేశంలో ఉన్న 33 విదేశీ బ్యాంకుల్లో హెచ్‌ఎస్‌బీసీ, సిటీ బ్యాంక్, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకులు వందేళ్లు పూర్తిచేసుకున్నాయి. వీటి ఆస్తుల విలువ 1996-97లో మొత్తం బ్యాంకింగ్ రంగంలోని ఆస్తుల విలువలో 8.35 శాతం ఉండగా.. ప్రస్తుతం ఇది 6.9 శాతానికి తగ్గింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, దేనా బ్యాంక్, పంజాబ్ అండ్ సింథ్ బ్యాంకులు మూలధన మార్కెట్ నుంచి నిధుల సమీకరణకు అనుమతి పొందాయి. ఆంధ్రాబ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, యూకోబ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, విజయ బ్యాంక్‌లు పెట్టుబడుల సమీకరణ కోసం ప్రయత్నిస్తున్నాయి.

## టెలికమ్యూనికేషన్స్:

టెలికాం రంగంలో పెట్టుబడుల పరిమితిని 2005లో 49 నుంచి 74 శాతానికి పెంచారు. 1991 నుంచి 2008 మధ్య కాలంలో ఈ రంగానికి రూ.12,750.94 కోట్లు విదేశీ పెట్టుబడుల రూపంలో లభించాయి. ప్రపంచంలో అతిపెద్ద టెలికాం మార్కెట్‌గా భారత్ రూపొందిన నేపథ్యంలో.. యూరోప్, కొరియా, జపాన్ దేశాల నుంచి మరిన్ని పెట్టు

బడులు ఈ రంగానికి లభించే అవకాశం ఏర్పడింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వల్ల ఈ రంగంలో కలిగిన ప్రభావాలు.

- సబ్సిడీ ధరల వద్ద టెలికాం సర్వీసులు లభిస్తున్నాయి.
- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహం సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, మార్కెట్ పెంపునకు తోడ్పడింది.
- భారత్‌లో 70 శాతం మంది ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నందు వల్ల టెలికాం రంగంలో అవస్థాపనా సౌకర్యాల పెంపు కోసం ఎఫ్‌డీఐలు దోహదపడతాయి.
- దేశంలో విదేశీ కరెన్సీ ప్రవాహం పెరుగుతోంది.
- విదేశీ పెట్టుబడులు అందించే దేశంతో భారత్‌కు స్నేహ పూర్వక సంబంధాలు ఏర్పడతాయి.
- స్వదేశంలో పోటీ వాతావరణం ఏర్పడి వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుంది.
- సాంకేతిక పరిజ్ఞానం పెరిగి వాయిస్ అండ్ డేటా క్వాలిటీ పెరుగుతుంది.

## రిటైల్ రంగం:

ప్రపంచంలో భారతదేశం పదో అతిపెద్ద రిటైల్ మార్కెట్‌గా అవతరించింది. దేశ స్థూల జాతీయోత్పత్తిలో ఈ రంగం వాటా గణనీయంగా పెరుగుతోంది. జీడీపీలో రిటైల్ అమ్మకాల వాటా 30 శాతంకు పైగా ఉంది. రిటైల్ అమ్మకాలలో ఫుడ్ అండ్ గ్రోసరీ, టెక్స్‌టైల్స్, వినియోగ అనశ్వర వస్తువులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. అంత ర్జాతీయ కంపెనీలు తమ సాంకేతిక పరిజ్ఞానం, బ్రాండ్ పేరును స్థానిక భాగ స్వామికి ఇవ్వడం ద్వారా ప్రతిఫలం పొందుతున్నాయి. మెక్‌డోనాల్డ్, రీబాక్‌లు 49 శాతం వాటాతో స్థానికంగా ఈ రంగంలో కార్యకలా పాలు కొనసాగిస్తున్నాయి. అసోచామ్ నివేదిక ప్రకారం 2008లో దేశం లో మొత్తం రిటైల్ మార్కెట్ విలువను 353 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. ఈ రంగం ఏటా 8 శాతం వృద్ధి రేటును సాధిస్తూ.. 2010 నాటికి మొత్తం 416 బిలి యన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. రిటైల్ పరిశ్రమలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సంఘటిత రిటైల్ రంగంలో వృద్ధిని పెంచడమే కాకుండా ఆహార ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, టూరిజం రంగాలకు కూడా ప్రయో జనం చేకూరుస్తున్నాయి.

## విమానాశ్రయాలు:

భారత్‌లో మొత్తం 125 విమానాశ్రయాలున్నాయి. వీటిలో పదకొండు విమానాశ్రయాలను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా పరిగణిస్తు న్నారు. దేశంలోని విమానాశ్రయాలను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది. ఈ రంగంలో విదేశీ పెట్టుబడులకు సంబం ధించిన విధానంలో ముఖ్యాంశాలు..

- వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రస్తుతమున్న విమానాశ్రయాలకే పరిమితం చేస్తున్నారు. 74 శాతం పైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో.. విదేశీ పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు అనుమతి తప్పనిసరి.
- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆటోమేటిక్ రూట్ ద్వారా అనుమతిస్తున్నారు.
- స్వదేశీ ఎయిర్‌లైన్స్‌లలో 49 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆటోమేటిక్ రూట్ ద్వారా అనుమతిస్తారు.
- ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టుల్లో 10 సంవత్సరాల వరకు 100 శాతం పన్ను మినహాయింపునిస్తారు.
- ఎన్ఆర్ఐల ద్వారా 100 శాతం ఈక్విటీని అనుమతిస్తారు.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించి ప్రభుత్వం అవలంబించిన విధానాలు దేశంలో ప్రోత్సాహకర వాతావరణాన్ని కల్పించాయి. ఢిల్లీ, ముంబై ఎయిర్‌పోర్టులలో ప్రైవేటీకరణను అనుమతించడం ద్వారా రూ.15,700 కోట్ల పెట్టుబడులకు అవకాశం ఏర్పడింది. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 'జర్మనీ సీమెన్స్ గ్రూప్' 141 బిలియన్ రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసింది. మరో 25 నగరాల్లో ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి సంబంధించి ప్రైవేటు పెట్టుబడులకు గల అవకాశాలను పరిశీలిస్తున్నారు. చెన్నై, కోల్‌కతా ఎయిర్ పోర్టుల ఆధునికీకరణతో పాటు గోవా, పుణే, నోయిడా, నవీ ముంబైలలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

## ఫార్మాస్యుటికల్స్,డ్రగ్స్:

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అత్యధికంగా ఆకర్షిస్తున్న 5 ప్రధాన రంగాల్లో ఫార్మాస్యుటికల్ రంగం ముఖ్యమైంది. ఈ రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తున్నారు. దేశ జీడీపీలో ఈ పరిశ్రమ 1.3 శాతం వాటాను కలిగి ఉంది. మొత్తం ఈ రంగంలో 3000 మధ్య, చిన్న ఉత్పత్తిదారులు ఉన్నారు. రాన్‌బాక్సీ, సిప్లా, డాక్టర్ రెడ్డీస్ ఈ రంగంలోని ప్రముఖ స్వదేశీ కంపెనీలు కాగా.. ఫైజర్, నోవార్టిస్, జాన్సన్ అండ్ జాన్సన్, గ్లాక్సో, స్మిత్ క్లైన్‌లు ముఖ్యమైన అంత ర్జాతీయ పరిశ్రమలు.

## ఆటోమొబైల్ రంగం:

ఇటీవల కాలంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను విపరీతంగా ఆకర్షించిన రంగాల్లో ఆటోమొబైల్ ఒకటి. దేశంలో ప్రజల వ్యయార్హ ఆదాయాలు పెరగడంతో కార్లు, ఇతర వాహనాలకు డిమాండ్ పెరిగింది. తిరిగి చెల్లించే తేలికైన పథకాలు, ఇతర ఆకర్షణీయ స్కీమ్‌లు ఆటోమొబైల్ రంగ అభివృద్ధికి దోహదపడ్డాయి. ఏటా 18 శాతం వృద్ధి రేటును సాధిస్తున్న ఈ రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తున్నారు. ఆటోమొబైల్ రంగంలో మొత్తం ఉత్పత్తి 1991లో 2 మిలియన్‌లు. కాగా ఇది 2006లో 9.7 మిలియన్‌లకు పెరిగింది. ఇంజనీరింగ్ కేంద్రాల ఏర్పాటు, ద్విచక్ర వాహనాల ఎగుమతులు, పరిశోధన కేంద్రాలు, హెవీట్రక్, ప్యాసింజర్ కార్ విభాగాల్లో అవకాశాలు మెరుగయ్యాయి. ఈ పరిశ్రమ టర్నోవర్ 12 బిలియన్ డాలర్లకు

చేరుకుంది. ఈ రంగానికి సంబంధించిన పరికరాల దిగుమతులను ఎటువంటి ఆంక్షలు లేకుండా అనుమతిస్తున్నారు.

### రియల్ ఎస్టేట్ రంగం:

ప్రభుత్వం ప్రకటించిన అనేక ప్రోత్సాహకాల వల్ల ఈ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహం పెరిగింది. 2005-06లో రియల్ ఎస్టేట్ రంగానికి రూ.171 కోట్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రూపంలో లభించాయి. ఇవి 2008-09లో రూ.7790 కోట్లకు పెరిగాయి. రెసిడెన్షియల్, ఆఫీస్ ప్రాపర్టీ, టైర్-2 నగరాలలో ఐటీ, ఐటీ సంబంధిత స్పేస్ అవసరాల కోసం ఏర్పడిన డిమాండ్‌తో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడుల ప్రవాహం కొనసాగింది. దేశంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ మొత్తం విలువలో రెసిడెన్షియల్ ప్రాపర్టీ మార్కెట్ 75 శాతం వాటా కలిగి ఉంది.

### ముఖ్యాంశాలు:

- ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 శాతం వరకు అనుమతిస్తున్నారు.
- దేశంలో 29 ప్రైవేటు బ్యాంకులు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి.
- బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, దేనా బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులు మూలధన మార్కెట్ నుంచి నిధుల సమీకరణకు అనుమతి పొందాయి.
- టెలికాం రంగానికి 1991 నుంచి 2008 వరకు రూ.12750.94 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు లభించాయి.
- మెక్‌డోనాల్డ్, రీబాక్‌లు 49 శాతం వాటాతో స్థానికంగా రిటైల్ రంగంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి.
- గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆటోమేటిక్ రూట్ ద్వారా అనుమతిస్తున్నారు.
- బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 'జర్మనీ సీమెన్స్ గ్రూప్' 14.1 బిలియన్ రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసింది.
- ఫార్మాస్యుటికల్స్, డ్రగ్స్ పరిశ్రమ దేశ జీడీపీలో 1.3 శాతం వాటా కలిగి ఉంది.
- ఆటోమొబైల్ రంగ వార్షిక వృద్ధి 18 శాతం. టర్నోవర్ 12 బిలియన్ డాలర్లకు చేరుకుంది.